## క్లుప్తంగా

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ చెందిన చిట్టెమ్మకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరు చేసిన రూ.27,500చెక్కును ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాదులోని ఆయన నివాసంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, శ్రీశైలం, శేఖర్, జగన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కల్వకుర్తిరూరల్: వానాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులపై కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఆంజనేయులు సూచించారు. బుధవారం మండలంలోని జంగారెడ్డిపల్లి, ఎల్లికల్‌లో పర్యటించారు. ప్రధానంగా పారిశుద్ధ్య పనులను, పల్లెప్రకృతి వనాల నిర్వహణ, నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ దేవేందర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### గడప గడపకు బీజేపీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని గురించి నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సాయికృష్ణ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

### మాజీ మంత్రి పరామర్శ

పెద్దకొత్తపల్లి: మండలంలోని నక్కలపల్లికి చెందిన వడ్డెకుర్మయ్య అనారోగ్యానికి గురయ్యారు. బుధవారం మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు గ్రామానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, ఎంపీటీసీ రవికుమార్, బాలస్వామి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

### రోడ్డుపై నాటు వేసి నిరసన



కోడేరు: మండల కేంద్రంలోని ఊరగుట్ట సమీపంలో కోడేరు నుంచి పస్పుల వెళ్లే రహదారిని బాగు చేయాలని గ్రామస్తులు వరినాట్లు వేసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్డు బురదమయంగా మారిందని దీంతో వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాత్కాలికంగా డస్టు వేసి రోడ్డును బాగు చేయాలని వారు కోరారు.

### మహిళకు తీవ్ర గాయాలు

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ చెందిన ఎల్లమ్మ బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్లమ్మ తన భర్త బంగారయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై బిజినేపల్లి నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనకాల నుంచి వచ్చిన ఓ వాహనం ప్రమాదశావత్తు బ్రేకులు విఫలం కావడంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఎల్లమ్మకు రెండు కాళ్లు విరిగిపోగా, బంగారయ్యకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించగా కాళ్లకు శస్త్రచికిత్స చేయాల్సి ఉండటంతో అటు నుంచి పాలమూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

### డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం

కొల్లాపూర్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామరాజుయాదవ్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ కే.మల్లేశం ములుగు డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. దీంతో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న రామరాజు యాదవ్‌కు బుధవారం లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు. అధ్యాపకులతో పాటు, విద్యార్థులు ఆయనను సత్కరించారు.



# ముసురుతో జనజీవనం అస్తవ్యస్తం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో రోజంతా ముసురు వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం వస్తుంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు 40.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ విశ్వేశ్వర్ వెల్లడించారు.

కొల్లాపూర్ రూరల్: వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని గ్రామాలలో ఉన్న వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎక్కడ చూసిన పొలాలు నీటితో నిండి ఉన్నాయి. సమీపంలో ఉన్న మూలవాగు పెద్ద ఎత్తున ప్రవహిస్తుంది. కుడికిల్ల సమీపంలో, ముక్కిడిగుండం సమీపంలో ఉన్న పెద్ద వాగుకు వరద వస్తుంది.

పెద్దకొత్తపల్లి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొల్లాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలతో కొత్తపల్లి రోడ్డు రద్దీగా ఉండేది. ముసురు వర్షానికి వాహనాలు లేక రోడ్డంతా వెలవెలబోతుంది.

అచ్చంపేట రూరల్: ముసురు వర్షాలకు పట్టణ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ కోరారు. రెండు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వివిధ కాలనీలు, ప్రధాన రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. బుధవారం ఉదయం మున్సిపల్ కార్మికులతో కలిసి కాసేపు పారిశుద్ధ్య పనులు చేశారు.



పెంట్లవెల్లిలో కురుస్తున్న వర్షం

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అంతర్గత రోడ్లు బురదమయమై నడక ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెలో ఉండడం వల్ల పారిశుద్ధ్యం లోపించి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షపునీరంతా రోడ్లపై నిల్వ ఉండి దుర్వాసన వస్తుంది.

పెంట్లవెల్లి: వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షపునీరు పారుతుండడం, పారిశుద్ధ్యం లోపించి దుర్వాసన వస్తూ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

కల్వకుర్తిరూరల్: ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు మండలంలోని తోటపల్లిలో దుందుబీ నదిపై నిర్మించిన చెక్‌డ్యాంలో వరదనీరు చేరుకుంది. బుధవారం గ్రామానికి చెందిన జాలర్లు చెక్‌డ్యాంలో చేపలవేట చేశారు.

అమ్రాబాద్: అమ్రాబాద్, పదర మండలాల్లో రెండు రోజులుగా ముసురు వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వీధిరోడ్లు బురదమయంగా మారి నడిచేందుకు వీలు లేకుండా ఉంది.



తాడూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



అచ్చంపేటలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న చైర్మన్



నిర్మానుష్యంగా మారిన పెద్దకొత్తపల్లి రోడ్డు

# విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దు

కల్వకుర్తిటౌన్: బీసీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయటంతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. 320మంది విద్యార్థులకు ఒకే గదిలో విద్యతోపాటు వసతి గృహంగా ఉపయోగించటం బాధ కలిగిందన్నారు. పరిసర ప్రాంతాలను పరిశీలించగా పలు సమస్యలు దర్శనమిచ్చాయన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పాఠశాలల్లో నెలకొన్న పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ వైస్ చైర్మన్**

పట్టణంలోని స్టేడియంలో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ బుధవారం కలెక్టర్‌ను కలిశారు. సమస్యలపై వినతిని అందజేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యేలా అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు తెలిపినట్లుగా తెలియజేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్

### మహాసభను విజయవంతం చేద్దాం

కల్వకుర్తిరూరల్: విశ్వరూప సభను విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ శేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని లింగసానిపల్లిలో కమిటీని ఎంపిక చేశారు. వర్గీకరణ ఆశయ సాధనలో పోరాటానికి సిద్ధం కావాలన్నారు.

### డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తులు



కందనూలు: ఎంజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి స్పందన లభించిందని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బుధవారం తెలిపారు. యువత పెద్ద ఎత్తున తమ డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

# ‘బీఆర్‌ఎస్‌లో సరైన గుర్తింపు లేదు’



మాట్లాడుతున్న విండో చైర్మన్ భాస్కర్‌రావు

వెల్దంద: బీఆర్‌ఎస్‌లో సరైన గుర్తింపు లేకపోవడంతోనే త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు సింగల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను ప్రజలు కోరుతున్నట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషిచేస్తామన్నారు. గతంలో పార్టీలో క్రియాశీలకంగా కల్వకుర్తి, కొల్లాపూర్, జడ్చర్ల నియోజకవర్గాల్లో పని చేశానని పేర్కొన్నారు. కొల్లాపూర్‌లో నిర్వహించే కాంగ్రెస్ సభలో పార్టీలో చేరనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మోతిలాల్‌నాయక్, వెంకటయ్యగౌడు, నరేష్, వెంకట్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఎర్ర శేఖర్, శ్రీనివాస్‌యాదవ్, పుల్లయ్య, రమేష్, రషీద్, హమీద్ తదితరులు ఉన్నారు.

### పార్టీ బలోపేతానికే కమిటీల ఏర్పాటు

తెలకపల్లి: పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని బీఆర్‌ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ఈదుల నరేందర్‌రెడ్డి, యాదయ్య తెలిపారు. బుధవారం కేంద్రంతో పాటు రాకొండలో బీఆర్‌ఎస్ బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం, సీఎం కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, దళితబంధు, కేసీఆర్ కిట్‌లతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, యాదయ్య, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మమ్మ, విజయలక్ష్మి, లక్ష్మారెడ్డి, కృష్ణయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భవనాల్లోకి తరలించండి

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని తుర్కపల్లిలో పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ రామ్మోహన్ బుధవారం పరిశీలించారు. అధిక వర్షాల నేపథ్యంలో డెంగీ, కలరా, మలేరియా సీజనల్ వ్యాధులపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. పాతబడిన ఇళ్లలో ఉండేవారిని పంచాయతీ కార్యాలయం, పాఠశాల భవనాలకు తరలించి ఆశ్రయం కల్పించాలని చెప్పారు. డ్రైనేజీల పూడికతీత పనులను పరిశీలించారు. వానాకాలంలో నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్స్, బ్లీచింగ్ పౌడర్ వేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటయ్య, కార్యదర్శి విష్ణు తదితరులు పాల్గొన్నారు.



తుర్కపల్లిలో ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

# సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

బిజినేపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 21 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం కార్మికులు గాంధీ విగ్రహానికి తమ వినతిపత్రం సమర్పించారు. తమకు కనీస వేతనంతో పాటు మూడు నెలలుగాలో వేతనాలు ఇతర డిమాండ్లు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శుభాకర్, రాములు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: హక్కుల సాధనకై తలపెట్టిన పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె కొనసాగుతుంది. ప్రభుత్వం తమ సమస్యలను సానుకూలంగా వ్యవహరించి పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖైరత్, బాలస్వామి, మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

**రూ.19వేల వేతనం ఇవ్వాలి**

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో పంచాయతీ వర్కర్లు 21 రోజులుగా చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోవడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. 11వ పీఆర్‌సీ ప్రకారం రూ.19వేల వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులకు కష్టానికి తగ్గ ఫలితం ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, రామకృష్ణ, ఎస్.హనుమంతు, రామకృష్ణ, శ్రీనివాసులు, చిట్టమ్మ, లక్ష్మీ, పెంటమ్మ, సాలమ్మ, ఈశ్వర్, చందు, చిన్నమ్మ, అమ్ములమ్మ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో వర్షంలోనూ నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

కల్వకుర్తిరూరల్: సమ్మెలో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు.

తెలకపల్లి: రోజుకో వినూత్న కార్యక్రమంతో కార్మికులు ప్రభుత్వానికి నిరసన తెలుపుతున్నారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా తడుస్తూ సమస్యల పరిష్కారం కోసం సమ్మెను కొనసాగించారు. ఈ నెల 27న కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నామని కార్మికులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తుమ్మ మహేష్, వెంకటయ్య, సైదులు, అక్కమ్మ, బాలకిష్టమ్మ, మైసమ్మ, కార్మికులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

# పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు

తాడూరు: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ గంగమోహన్ తెలిపారు. ఎస్సీ, ఎసీ, చిన్న సన్నకారులు రైతులు 5 ఎకరాలలోపు ఉన్న పట్టాదారులు ఉపాధి జాబ్‌కార్డు కలిగిన వారు బోరుబావితో పాటు, విద్యుత్ సౌకర్యం ఉన్నవారు అర్హులన్నారు. మామిడి, జామ, సపోటా, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్స్, ఆయిల్‌ఫాం, బత్తాయి, అల్లనేరడి తోటలు పెంచుకోవచ్చన్నారు. 31లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

చారకొండ: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పండ్ల తోటల పెంపకానికి సన్న, చిన్నకారు రైతులు దరకాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జయసుధ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడీ ద్వారా డ్రిప్పులు అందజేస్తారని తెలిపారు. తోటల నిర్వహణకు గుంతల నుంచి మూడెళ్ల పాటు నిర్వహణకు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం

కొల్లాపూర్: అక్రమంగా నాటుసారా, నల్లబెల్లం తరలిస్తూ పట్టుబడ్డ ఆరు మోటార్‌సైకిళ్లకు బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహించారు. సీఐ ఏడుకొండలు సమక్షంలో వేలం సాగింది. వేలంలో రూ.84,100 ఆదాయం వచ్చినట్లు సీఐ వెల్లడించారు.

**నేడు వాహనాల వేలం**

అచ్చంపేట రూరల్: ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 12 వాహనాలను గురువారం ఉన్నతాధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ బాల్‌రాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. ద్విచక్ర వాహనానికి రూ. 5వేలు, త్రీ, ఫోర్ వీలర్ వాహనాలకు రూ. 20వేలు ప్రవేశ రుసుంగా చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలం పాటలో వాహనాలు దక్కని వారికి ప్రవేశ రుసుం తిరిగి చెల్లిస్తామన్నారు. ఉదయం 10గంటలకు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహిస్తామని తెలిపారు.



కొల్లాపూర్‌లో వేలం నిర్వహిస్తున్న పోలీసులు

# బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి



కొండనాగులలో బీసీ బాలుర వసతి గృహం పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వలబాలరాజు

బల్మూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని మైలారంలో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణంతో పాటు సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అందరూ ఐక్యమత్యంతో కృషి చేయాలని సూచించారు. గ్రామంలోని పాఠశాలలో అదనపు గదులు, వాటర్‌ట్యాంకు కావాలని గ్రామస్తులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

**బీసీ బాలుర వసతి గృహం పరిశీలన**

మండలంలోని కొండనాగుల బీసీ బాలుర వసతి గృహాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులూడుతున్నాయని స్థానికులు ప్రభుత్వ విప్ దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన అక్కడే అధికారులతో మాట్లాడారు. భవనం కూల్చివేసి తన నిధులతో మొదటి విడతగా రూ.50.లక్షలతో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ జబ్బు నర్సయ్య, సర్పంచ్ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ నారాయణ, గోపాల్ నాయక్, దేవస్వామి, లక్ష్మయ్య, సత్యంగౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కులాల వారీగా రిజర్వేషన్లు కల్పించాలి

కొల్లాపూర్: కులాల వారీగా రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో రిజర్వేషన్ డే వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో సాహూ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ గగనం శేఖరయ్య, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య మాట్లాడారు. కొల్హాపూర్ సంస్థానంలో మొట్టమొదటగా కులాల వారీగా రిజర్వేషన్లు అమలుచేసిన ఘనుడు సాహూ మహరాజ్ అని కొనియాడారు. బాలికల కోసం పాఠశాలలు ఏర్పాటుచేసి, ఉపకారవేతనాలు అందించారన్నారు. జోగినీ, దేవదాసి వ్యవస్థలను రద్దుచేశారన్నారు. కార్యక్రమంలో విష్ణు, వెంకటేష్, కృష్ణయ్య, విద్యారాణి, బాలకృష్ణుడు, లక్ష్మణ్, దాసు, మధు, రాకేష్ తదితరులున్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

# ఒంటికాలిపై నిలబడి స్వీపర్ల నిరసన



ఒంటికాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న పాఠశాలల స్వీపర్లు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు బుధవారం ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. 31 రోజులుగా స్కూల్ స్వీపర్లు స్థానిక గాంధీ పార్కులో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు బుధవారం ప్రభుత్వంపై మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా 160 మంది స్కూల్ స్వీపర్లు కేవలం రూ.1,623 అతితక్కువ వేతనంతో పనిచేస్తున్నారన్నారు. ఆర్థికంగా చితికిపోయిన స్కూల్ స్వీపర్లు తీవ్రంగా నష్టపోయారని జీవితాంతం విధులు నిర్వహిస్తూ మరణించిన కుటుంబాలను ఆదుకునే దిక్కు లేదన్నారు. తెలంగాణ వస్తే తమ బతుకులు మారుతాయని, ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయని ఆశపడ్డ స్వీపర్లకు నిరాశే మిగిలిందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, చనిపోయిన ఉద్యోగి స్థానంలో వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరిగౌడ్, వెంకటయ్యగౌడ్, అర్జున్, మహ్మద్‌అలీ, రామస్వామి, నారాయణగౌడ్, వెంకటయ్యగౌడ్, పుల్లయ్య, రామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు లేకుండా చూడాలి

వెల్దంద: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులు కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు తాగునీరు, ఇతర సమస్య లేకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్మికులు సమ్మెల్లో ఉండడంతో పారిశుద్ధ, తాగునీరు సరఫరా తదితర వాటికి తాత్కాలికంగా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. హరితహారంలో భాగంగా గ్రామాల్లో ఇచ్చిన లక్ష్యం పూర్తి చేయాలన్నారు. ప్రతి మొక్కకు కంచెను ఏర్పాటు చేసి రక్షించాలన్నారు. కూలీలకు సకాలంలో డబ్బులు అందేవిధంగా మస్టర్లను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ సునీత, ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, ఈసీ దేవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### క్రీడా ప్రాంగణ స్థలాల పరిశీలన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అంకిరావుపల్లి, బోడబండతండా, ఎల్లూరులో ఎంపీడీఓ చెన్నమ్మ, పంచాయతీ కార్యదర్శులతో కలిసి క్రీడా ప్రాంగణ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఎల్లూరులో ఈజీఎస్ నిధుల నుంచి చేపడుతున్న పనులను పరిశీలించారు.